క్లుప్తంగా

వైఎస్సార్‌సీపీ నేతకు పరామర్శ



వెంకటేశ్వర్లును పరామర్శిస్తున్న సంజీవయ్య

నాయుడుపేటటౌన్: రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడి నెల్లూరు వైద్యశాలలో చికిత్స పొందుతున్న వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ బీసీ నేత చిందేటి వెంకటేశ్వర్లును బుధవారం సూళ్లూరుపేట మాజీ ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్య పరామర్శించారు. ఆయన వెంట పార్టీ నాయకులు కటకం జయరామయ్య, దారా రవి ఉన్నారు.

పచ్చిరొట్ట విత్తనాల పంపిణీ



విత్తనాలు రైతులకు అందజేస్తున్న అధికారులు

వాకాడు: మండలంలోని రైతులకు బుధవారం పచ్చి రొట్ట విత్తనాలు పంపిణీ చేశారు. మండల వ్యవసాయ అధికారిణి ఎ దీప మాట్లాడుతూ మండలానికి 400 క్వింటాళ్ల పచ్చి రొట్ట విత్తనాలు కేటాయించినట్లు వివరించారు. అందులో తొలివిడతగా 236 క్వింటాళ్లు రైతు సేవా కేంద్రాలకు పంపించినట్లు తెలిపారు. విత్తనాలు అవసరమైన రైతులు ఆయా రైతు సేవా కేంద్రాలను సంప్రదించాలన్నారు.

వరిలో యాజమాన్య పద్ధతులు

ఓజిలి: వరి పంటలో యాజమాన్య పద్ధతులు పాటిస్తే అధిక దిగుబడులు సాధించవచ్చని వ్యవసాయ అధికారి వరప్రసాద్ పేర్కొన్నారు. మండలంలోని తిరుమలపూడి, కుందాం, గ్రద్దగుంట గ్రామాల్లో పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని బుధవారం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ వ్యవసాయంలో తక్కువ పెట్టుబడితో అధిక దిగుబడులు సాధించే యజమాన్య పద్ధతులను తెలియజేశారు. ఈయన వెంట విస్తరణాధికారి డెన్‌దీప్ తదితరులు ఉన్నారు.

ఉచిత నేత్ర వైద్యశిబిరం



కంటి పరీక్షలు చేస్తున్న వైద్యులు

చిట్టమూరు: మండల పరిధిలోని తీరప్రాంత గ్రామం పల్లంపర్తిలో పంచాయతీ సర్పంచ్ ముత్తుకూరు వెంకటరమణమ్మ భర్త వైఎస్సార్ సీపీ నేత దీనబంధు బుధవారం ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించారు. నెల్లూరులోని సుశీల నేత్రాలయ సూపర్ స్పెషాలిటీ వైద్యుల నేతృత్వంలో పల్లంపర్తి గ్రామంలో ఉచితంగా కంటి వైద్య శిబిరం ఏర్పాటు చేయించారు. కంటి వైద్యుడు కేశవులు కంటి పరీక్షలు నిర్వహించి మందులు అందజేశారు. కంటి అద్దాలు అవసరమైన వారికి ఉచితంగా అందజేశారు.

ఉచిత దంత వైద్యశిబిరం

గూడూరురూరల్ : పట్టణంలోని దువ్వూరు రమణమ్మ మహిళా కళాశాల(డీఆర్‌డబ్ల్యూ)లో బుధవారం రోటరీ క్లబ్, కళాశాల ఎన్.ఎస్.ఎస్.యూనిట్ సహకారంతో ఉచిత దంత వైద్య శిబిరం నిర్వహించారు. విద్యార్థినులకు దంత పరీక్షలు నిర్వహించి ఉచితంగా మదులను పంపిణీ చేశారు. అనంతరం కళాశాల యాజమాన్యం దంత వైద్యశాల సిబ్బందిని అభినందించారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్ హనుమంతరావు, వైస్ ప్రిన్సిపల్ గాయత్రి, డాక్టర్ నారాయణ, కళాశాల సిబ్బంది పాల్గొన్నారు.

ఉపాధి పనుల తనిఖీ



నిమ్మ చెట్లను పరిశీలిస్తున్న పీడీ గంగాభవాని

కలువాయి(సైదాపురం): మండలంలోని చీపినాపి గ్రామంలో జరుగుతున్న ఉపాధి హామీ పథకం పనులను నెల్లూరు జిల్లా డ్వామా పీడీ గంగాభవాని తనిఖీ చేశారు. పనుల వివరాలను ఫీల్డ్ అసిస్టెంట్ రమేష్ అడిగి తెలుసుకున్నారు. గ్రామంలో హార్టికల్చర్ ద్వారా నిమ్మ చెట్లు ఏ నర్సరీ ద్వారా తీసుకువచ్చారని ఏపీఓ సునీల్‌ని అడిగి తెలుసుకున్నారు. అనంతరం తోపుగుంట గ్రామంలో పశువుల నీటి తొట్టెలను పరిశీలించారు. మండలంలో ఉపాధి కూలీలను ఇంకా పెంచాలని సిబ్బందికి తెలియజేశారు. వీరితో పాటు ఏఓ సునీల్ ఈసీ ఉమాదేవి, టెక్నికల్ అసిస్టెంట్ నరసింహ, వినోద్, పీఎఫ్‌టీ ఏడుకొండలు పాల్గొన్నారు.

చికెన్ ధరలు		07.8.2025
నెల్లూరు పౌల్ట్రీ అసోసియేషన్ ధరలు		
బ్రాయిలర్ లైవ్	:	107
లేయర్ లైవ్	:	112
బ్రాయిలర్ చికెన్	:	200
బ్రాయిలర్ స్కిన్‌లెస్	:	222
లేయర్ చికెన్	:	190





వెంకటరెడ్డిపాలెంలో ఖరీఫ్‌లో సాగులో ఉన్న వరి పంట

- రైతులను మోసం చేసిన కూటమి ప్రభుత్వం
- గతంలో 9760 మంది రైతులకు రైతుభరోసా

5వేల మందికి దుఃఖీభవ

ఓజిలి: కూటమి ప్రభుత్వం అమలు చేసిన అన్నదాత సుఖీభవ పథకం 5 వేల మందికి పైగా అందలేదు. అన్ని అర్హతలు ఉన్నప్పటికీ తమ ఖాతాల్లో నగదు జమ కావడం లేదంటూ రైతులు గగ్గోలు పెడుతున్నా పట్టించుకునే దిక్కులేదు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే రైతు భరోసా పేరును అన్నదాత సుఖీభవగా మార్చింది. ఈ అన్నదాత సుఖీభవ పథకం నగదును గతేడాది ఇవ్వకుండా రైతులను నట్టేట ముంచారు. గత ప్రభుత్వం మండలంలో 9,760 మందికి రైతు భరోసా పథకం ద్వారా నగదు రూ.13,500 అందించింది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక 7,052 మంది రైతులు ఖాతాలను పరిశీలించిన అధికారులు 4504 మంది రైతులను మాత్రమే లబ్ధిదారులుగా చూపారు. అయితే వారికి కూడా సక్రమంగా రైతుల ఖాతాల్లో నగదు జమ కాకపోవడం గమనార్హం. గత ప్రభుత్వంలో అర్హత పొందిన 5 వేల మందికి పైగా రైతులను ఈ సారి అనర్హుల పేరుతో అన్యాయం చేశారు.

బీమా వసూలు

రైతుల నుంచి ఒక్క రూపాయి కూడా తీసుకోకుండా ప్రతి రైతు పేరుతో పంటల బీమా పథకం చేయించింది. అందరికీ పంటల బీమా నగదు అందేలా చర్యలు తీసుకుంది. ఈ ఏడాది రైతుల నుంచి పంటల బీమా రైతులే నగదు చెల్లించాలని ఆదేశించింది. గతేడాది పంటల బీమా పథకం ద్వారా లబ్ధి చేకూరకపోగా ఈ ఏడాది రైతులు ఆశతో తిరిగి పంటల బీమా చెల్లిస్తున్నారు. ప్రభుత్వం అందించే రూ.5 వేలు కన్నా రైతులు చెల్లించే పంటల బీమా నగదు ఎక్కువగా ఉంటుందని రైతులు ఆవేదన చెందుతున్నారు.

> **నగదు జమ అవుతుంది**
> మండలంలో అర్హులైన ప్రతి రైతుకు అన్నదాత సుఖీభవ నగదు అందుతుంది. మండలంలో 4504 మంది రైతులు అర్హులుగా ఎంపిక చేశారు. రైతులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదు. ప్రభుత్వం విడుదల చేసిన నగదును బ్యాంకు ఖాతాలలో పరిశీలించుకోవాలి.
> \- వరప్రసాద్, ఏఓ, ఓజిలి

కాకాణి పూజితతో మహిళా నాయకులు



కాకాని పూజితను మర్యాద పూర్వకంగా కలసిన గూడూరు మహిళా నాయకులు

చిల్లకూరు: మాజీ మంత్రి కాకాణి గోవర్ధనరెడ్డి కుమార్తె, కాకాణి పూజిత వైఎస్సార్‌సీపీ కార్యక్రమాల్లో చురుగ్గా పాల్గొనడంతో ఇటీవల వైఎస్సార్ సీపీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రకాశం, నెల్లూరు, తిరుపతి జిల్లా పార్టీ మహిళా వర్కింగ్ ప్రెసిడెంట్‌గా పూజితను ఎంపిక చేశారు. ఈ క్రమంలో గూడూరుకు చెందిన వైఎస్సార్‌సీపీ మహిళా నాయకులు సుజనరెడ్డి, దీప్తి ఎమ్మెల్సీ మేరిగ మురళీధర్ ఆధ్వర్యంలో కాకాణి పూజితను నెల్లూరులోని ఆమె నివాసంలో బుధవారం మర్యాద పూర్వకంగా కలసి శుభాకాంక్షలు తెలియజేశారు.

పోరంబోకు భూములపై విచారణ

సాక్షి ఎఫెక్ట్..



భూములు పరిశీలిస్తున్న అధికారులు

కలువాయి(సైదాపురం): మండలంలోని కుల్లూరు ఎర్రచెరువు ఆనుకుని ఉన్న రిజర్వ్ ఫారెస్ట్, చెరువు పోరంబోకు భూములను కొందరు కూటమి నాయకులు ఆక్రమించి 20 ఎకరాల వరకు చదును చేసిన భూములను అడ్డగించిన రెవెన్యూ అధికారులు బుధవారం ప్రచురితమైన 'పోరంబోకు కబ్జా' అనే కథనానికి అధికారులు స్పందించారు. అయితే ఇది తమ పరిధి కాదంటూ అటు రెవెన్యూ అధికారులు, ఫారెస్టు అధికారులు చెబుతుండడం గమనార్హం. మరి ఈ ఆక్రమించిన భూమి ఎవరు పరిధిలోకి వస్తుందో ఇంకా తెలియాల్సి ఉంది.

అగ్రిగోల్డ్ భూములు ఆక్రమిస్తే చర్యలు



అగ్రిగోల్డ్ భూములను పరిశీలిస్తున్న సీఐడీ అధికారులు

దొరవారిసత్రం : అక్కరపాక గ్రామ రెవెన్యూ పరిధిలోని అగ్రిగోల్డ్ భూములు ఎవరైనా ఆక్రమిస్తే చట్టరీత్యా చర్యలు తీసుకుంటామని తిరుపతి జిల్లా సీఐడీ సీఐ రంగస్వామి తెలియజేశారు. అక్కరపాక పరిధిలో ఉన్న 109 ఎకరాల అగ్రిగోల్డ్ భూమి ప్రభుత్వ ఆధీనంలో ఉన్న భూములను గురువారం సీఐడీ అధికారులు స్థానిక రెవెన్యూ అధికారులతో కలిసి పరిశీలించి రికార్డులను తనిఖీ చేశారు. అటాచ్‌మెంట్ చేసుకుని ఉన్న భూముల్లో ఎవరు దిగినా చట్టరీత్య చర్యలు తీసుకోకతప్పదని సీఐడీ అధికారులు హెచ్చరించారు. వీరి వెంట సీఐడీ ఎస్‌ఐ ధరణీధర్, వీఆర్వో జ్ఞానేంద్రం ఉన్నారు.

కార్యకర్తల కుటుంబాలకు అండగా ఉంటాం



సుబ్రహ్మణ్యం కుటుంబ సభ్యులను పరామర్శిస్తున్న ఎమ్మెల్సీ మేరిగ మురళీధర్

చిల్లకూరు : పార్టీ కార్యకర్తలు, వారి కుటుంబాలకు అండగా ఉంటామని ఎమ్మెల్సీ, గూడూరు నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త మేరిగ మురళీధర్ అన్నారు. గూడూరు మండలం విందూరు గ్రామానికి చెందిన గొర్తల సుబ్రహ్మణ్యం ఇటీవల అనారోగ్యంతో మృతి చెందాడు. ఈ మేరకు ఆయన ఉత్తర క్రియలు బుధవారం నిర్వహిస్తుండడంతో హాజరైన మేరిగ మురళీధర్ వారి కుటుంబ సభ్యులను పరామర్శించారు.

గూడూరును జిల్లా చేయండి



ర్యాలీ చేస్తున్న క్రీడాకారులు, వాకర్స్

గూడూరురూరల్ :నూతనంగా ఏర్పాటయ్యే జిల్లాల్లో గూడూరును జిల్లా కేంద్రంగా చేయాలని లేకపోతే నెల్లూరు జిల్లాలో కలపాలంటూ బుధవారం ఉదయం క్రీడాకారులు, వాకర్స్ గూడూరు పట్టణంలో ర్యాలీ నిర్వహించారు. వాకర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు వేగూరు రాజేంద్రప్రసాద్ మాట్లాడుతూ సార్వత్రిక ఎన్నికల సమయంలో గూడూరు నియోజకవర్గానికి వచ్చిన సీఎం చంద్రబాబు, లోకేష్, గూడూరును నెల్లూరు జిల్లాలో కలుపుతామని హామీ ఇచ్చారని గుర్తుచేశారు. వారి హామీ మేరకు గూడూరును నెల్లూరు జిల్లాలో కలపాలని కోరారు. ఈ కార్యక్రమంలో పీవీకే శర్మ, సుమన్‌రెడ్డి, కోటేశ్వరరావు, మస్తాన్, సాయి, మునీఫ్, శశిధర్, రాజా, ప్రసాద్, చిన్నారావు, రజనీకాంత్, హగ్గయ్య, సందీప్, ఇమ్రాన్, క్రీడాకారులు పాల్గొన్నారు.

స్మార్ట్ మీటర్లతో పెనుభారం

చిల్లకూరు: స్మార్ట్ మీటర్లను పెడితే పగలకొట్టండి అంటూ ప్రకటనలు గుప్పించిన కూటమి నాయకులు నేడు అదే మీటర్లు అమర్చడంపై సీపీఎం, సీపీఐ నాయకులు నిరసన తెలిపారు. గూడూరు, పేదల కాలనీల్లో కరపత్రాలను పంపిణీ చేసి స్మార్ట్ మీటర్లు పెట్టేందుకు వచ్చిన అధికారులను వెనక్కి పంపాలన్నారు. సీపీఎం, సీపీఐ నాయకులు జోగి శివయ్య, పామంజి మణి, అడపాల ప్రసాద్, ఎంబేటి చంద్రయ్య పాల్గొన్నారు.

ఇంటిపైకి దూసుకెళ్లిన లారీ

రాపూరు: రాపూరు–పెంచలకోన మార్గమధ్యంలోని జాతీయరహదారిలో మినీ లారీ అదుపుతప్పి ఇంటిపైకి దూసుకెళ్లిన సంఘటన బుధవారం చోటు చేసుకుంది. స్థానికులు కథనం మేరకు, తమిళనాడు నుంచి ఉదయగిరికి కొబ్బరికాయల లోడ్‌తో వెళుతున్న లారీ రాపూరు మండలం ఓబులాయిపల్లి వద్ద అదుపు తప్పి జయమ్మ ఇంటిపైకి దూసుకెళ్లింది. దీంతో ఆ ఇంటి ప్రహరీగోడ, ఇళ్లు దెబ్బతిన్నాయి. ఆ ఇంట్లో సమయానికి ఇంటి వద్ద ఎవరూ లేకపోవడంతో ప్రాణ నష్టం తప్పిందని స్థానికులు వివరించారు.

కండలేరులో 25 టీఎంసీలు

రాపూరు: కండలేరు జలాశయంలో బుధవారం నాటికి 25.302 టీఎంసీల నీరు నిల్వ ఉన్నట్లు జలాశయం ఈఈ గజేంద్రరెడ్డి తెలిపారు. సోమశిల నుంచి కండలేరుకు 1250 క్యూసెక్కుల నీరు చేరుతోందన్నారు. కండలేరు నుంచి సత్యసాయి గంగ, పిన్నేరు, లోలెవల్, హైలెవల్, మొదటి బ్రాంచ్ కాలువలకు 1750, 20, 90, 100, 85 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నట్లు తెలిపారు.

పొలం పిలుస్తోంది

వెంకటగిరి రూరల్ : మండలంలోని యాతలూరు, పెట్లూరు గ్రామాల్లో బుధవారం వ్యవసాయశాఖ ఏడీఏ అనసూయ ఆధ్వర్యంలో పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. అనంతరం రైతులకు జీలుగ, పిల్లిపసరి, పీఎండీఎస్ కిట్లను రాయితీతో రైతులకు పంపిణీ చేశారు.

జాతీయ నులిపురుగుల దినోత్సవంపై అవగాహన



పోస్టర్లను ఆవిష్కరిస్తున్న అధికారులు

చిట్టమూరు: జాతీయ నులి పురుగుల దినోత్సవంపై మండల స్థాయి అధికారులు సిబ్బందికి అవగాహన కల్పించారు. మండల పరిషత్ కార్యాలయంలో బుధవారం నిర్వహించిన సమావేశంలో ఎంపీడీవో మనోహర్ గౌడ్ మాట్లాడుతూ ఈ నెల 12న నేషనల్ డీ వార్మింగ్ డేను నిర్వహించనున్నట్లు తెలిపారు. ఏడాది చిన్నారి నుంచి 19 ఏళ్ల నుంచి యువకుల వరకు మాత్రలు వేయాలని సూచించారు. దీనికి సంబంధించిన పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో సీడీపీఓ మునికుమారి, విద్యాశాఖ అధికారి బీవీ కృష్ణయ్య, చిట్టమూరు, ఈశ్వరవాక, మల్లాం పీహెచ్‌సీ వైద్యులు పద్మావతి, విజయ్‌కుమార్ రెడ్డి, మదన్ మోహన్, సీహెచ్‌ఓ బాబురావు పాల్గొన్నారు.

ఏకొల్లులో గ్రామ సభ



గ్రామ సభ నిర్వహిస్తున్న తహసీల్దార్ శైలకుమారి

దొరవారిసత్రం: మండలంలోని ఏకొల్లు గ్రామ సచివాలయం వద్ద బుధవారం కళాకారుల నివేశ పట్టాల విషయమై స్థానిక తహసీల్దార్ శైలకుమారి ఆధ్వర్యంలో గ్రామ సభ నిర్వహించారు. గ్రామంలో చాలా కుటుంబాలు ఇంటి స్థలాలు లేని వారికి సర్వే నంబరు 44లో నివేశ స్థలాలు కేటాయించాలని స్థానికులు కోరారు. తహసీల్దార్ మాట్లాడుతూ అది అటవీ అధికారులు తమదేనని చెబుతున్నారని చెప్పారు. అయితే ఈభూమి ఎవరిదనే విషయం తేలిన తరువాత ఇంటి స్థలాల లబ్ధిదారుల జాబితాలను సిద్ధం చేసి అర్హత ఉన్న వారికి నివేశ స్థలాలు కేటాయిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ బ్లెస్సీ, ఎస్‌ఐ అజయ్‌కుమార్ పాల్గొన్నారు.

దళిత సంఘాల నివాళి



నివాళులర్పిస్తున్న బహుజన ఐక్యవేదిక

కోట: బహుజన ఐక్యవేదిక, బహుజన ఉద్యోగ సంఘాల ఆధ్వర్యంలో బుధవారం కోటలో చుండూరు దళిత అమరవీరులకు ఘనంగా నివాళులర్పించారు. ముందుగా బజారువీధిలో ఉన్న అంబేడ్కర్ విగ్రహానికి దళిత సంఘాల నాయకులు పూలమాల వేశారు. అనంతరం కొవ్వొత్తులు వెలిగించి 1991లో చుండూరులో జరిగిన మారణహోమంలో మృతి చెందిన వారికి నివాళులర్పించారు. కార్యక్రమంలో బహుజన ఐక్యవేదిక అధ్యక్షుడు మీజూరు మాధవ్, దాసరి సుందరం, పాల మల్లికార్జున్, నాగరాజు, దేవా, పనబాక హేమంత్ పాల్గొన్నారు.

ఆలయ భూముల్లో ఆక్రమణల తొలగింపు



ఆక్రమణలు తొలగిస్తున్న జేసీబీ

చిల్లకూరు: గూడూరు ఒకటో పట్టణంలోని కోదండరామ స్వామి ఆలయానికి సంబంధించి రెండో పట్టణంలో ఉన్న పోలయ్య గుంటలో ఆక్రమణలను బుధవారం దేవాదాయశాఖాధికారులు తొలగించారు. కోదండరామస్వామి ఆలయానికి చెందిన రెండో పట్టణంలో సుమారు 55 ఎకరాల్లో కొంత మంది స్థలాలను ఆక్రమించి క్రయ విక్రయాలు రిజిస్ట్రేషన్లు చేపట్టారు. వీటిని కొనుగోలు చేసుకున్న వారిలో ఎక్కువ శాతం ఉద్యోగులు 10 ఏళ్ల కిందట పక్కా భవనాలు నిర్మించుకుని జీవనం సాగిస్తున్నారు. సుమారు 15 ఎకరాల వరకు ఆక్రమణలకు గురి కావడంతో ఈ ఆక్రమణపై కోర్టును కూడా ఆశ్రయించిన వారు ఉన్నారు. ఈ క్రమంలో దేవాదాయశాఖాధికారులు ఆక్రమణలను తొలగించి, ఆలయ భూములను కాపాడేందుకు శ్రీకారం చుట్టారు. ఇందులోభాగంగా గత నెల రోజుల నుంచి ఆక్రమణదారులకు మౌఖిక ఆదేశాలిస్తూ ఇళ్లను తొలగిస్తామని చెప్పారు. ఇందులోభాగంగా పేదలు నిర్మించుకున్న చిన్న ఇళ్లను ముందుగా తొలగింపు చేపట్టారు. దీంతో పేదలు కష్టపడి స్థలాలు కొనుగోలు చేసి చిన్న ఇళ్లను కట్టుకుంటే వాటిని తొలగిస్తున్నారే తప్ప, పెద్ద భవనాల జోలికి వెళ్లడం లేదని, ఇది ఎంత వరకు న్యాయమని వారు ఆవేదన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో తిరుపతి జిల్లా దేవాదాయశాఖ అసిస్టెంట్ కమిషనర్ రామకృష్ణారెడ్డి, ఈఓ రవికృష్ణ ఇతర అధికారులు పాల్గొన్నారు. దీనిపై ఈఓ రవికృష్ణను వివరణ కోరగా దేవాదాయశాఖ జీఓ 60 ప్రకారం ఆక్రమణలను తొలగింపునకు ముందస్తు మౌఖిక ఆదేశాలు ఇచ్చామన్నారు. అలాగే పక్కా భవనాలు నిర్మించుకున్న ప్రతి ఒక్కరికీ సెక్షన్ 83 ప్రకారం నోటీసులు కూడా ఇచ్చి త్వరలోనే ఆక్రమణలను తొలగిస్తామని తెలిపారు.

తల్లిపాల ప్రాముఖ్యతపై అవగాహన

ఓజిలి/నాయుడుపేట టౌన్/సైదాపురం/రాపూరు/గూడూరురూరల్ /వెంకటగిరి రూరల్/దొరవారిసత్రం: తల్లిపాల ప్రాముఖ్యతపై ఐసీడీఎస్ అధికారులు మహిళలకు అవగాహన కల్పించారు. ఓజిలి బీసీ కాలనీ అంగన్‌వాడీ కేంద్రంలో సూపర్‌వైజర్ సుజన, నాయుడుపేట మండలంలో ఐసీడీఎస్ సీడీపీఓ ఉమామహేశ్వరి, కలువాయి మండలంలో సీడీపీఓ సునంద ఆధ్వర్యంలో తల్లిపాల వారోత్సవాలు నిర్వహించారు. రాపూరు మండలం రామదేవిపల్లి, మల్లమ్మగుంట గ్రామాల్లో ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు రాధిక, సౌజన్య, వెంకటగిరి మండలం సోమసానిగుంటలో సీడీపీఓ శంషాద్‌బేగం, దొరవారిసత్రం మండలంలో ఐసీడీఎస్ సీడీపీఓ జ్యోతికిరణ్ ఆధ్వర్యంలో తల్లిపాల వారోత్సవాలు నిర్వహించారు. గూడూరు ఐసీడీఎస్ పరిధిలోని నెల్లటూరులో సూపర్‌వైజర్ మెహబూబి ఆధ్వర్యంలో తల్లిపాల వారోత్సవాలు నిర్వహించారు.

కష్టపడి చదివితే ఉజ్వల భవిష్యత్



విద్యార్థులకు ఉచితంగా షూస్ అందిస్తున్న నిర్వాహకులు

రాపూరు: విద్యార్థులు కష్టపడి చదివితే ఉజ్వల భవిష్యత్ ఉంటుందని కరుణామయి విద్యాలయ సంస్థ ఇన్‌చార్జి వెంకట రాయులు అన్నారు. మండలంలోని గొనుపల్లి గ్రామం కరుణామయి విద్యాలయంలో చదువుకుంటున్న విద్యార్థులకు ఉచితంగా యూనిఫాం, షూస్, బెల్ట్, డైరీ వంటి సామగ్రి బుధవారం పంపిణీ చేశారు. కార్యక్రమంలో మస్తానయ్య, విద్యార్థులు పాల్గొన్నారు.

కాకాణితో నేదురుమల్లి, మాజీ మంత్రి ములాఖత్



జైలు నుంచి వస్తున్న నేదురుమల్లి రామ్‌కుమార్ రెడ్డి, ఆదిమూలపు సురేష్

సైదాపురం(వెంకటగిరి): నెల్లూరు సెంట్రల్ జైల్లో ఉన్న మాజీ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డిని వైఎస్సార్ సీపీ వెంకటగిరి నియోజకవర్గ సమన్వయకర్త నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి, మాజీ మంత్రి ఆదిమూలపు సురేష్ బుధవారం ములాఖత్ అయ్యారు. కాకాణి యోగ క్షేమాలను అడిగి తెలుసుకున్నారు.

ఉయ్యాలపల్లిలో నేదురుమల్లి



అనిల్ నివాసం వద్ద నేదురుమల్లి, పార్టీ శ్రేణులు

కలువాయి(సైదాపురం): మండలంలోని ఉయ్యాలపల్లి గ్రామంలో గాలం రవి గృహ ప్రవేశానికి వెంకటగిరి నియోజకవర్గ సమన్వయకర్త నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి విచ్చేసి రవిని ఆశీర్వదించారు. వీరితోపాటు కలువాయి జెడ్పీటీసీ సభ్యులు అనిల్‌కుమార్ రెడ్డి, వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

వైభవంగా కుంభాభిషేకం

పెళ్లకూరు: మండలంలోని రోసనూరు గ్రామంలో నూతనంగా నిర్మించిన శ్రీ వెంకటేశ్వరస్వామి ఆలయ కుంభాభిషేక మహోత్సవాన్ని బుధవారం గ్రామస్తులు వైభవంగా నిర్వహించారు. ఆలయ ప్రాంగణం అంతా చలువ పందిళ్లు వేసి, విద్యుత్‌దీపాలతో అందంగా అలంకరించారు. మంగళవాయిద్యముల నడుమ వేదపండితుల మంత్రోచ్చారణలతో మహాహోమం నిర్వహించారు. సూళ్లూరుపేట ఎమ్మెల్యే డాక్టర్ నెలవల విజయశ్రీ దంపతులు ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు.

వరలక్ష్మీ వ్రతం వేడుకలు రేపు

డక్కిలి : మండలంలోని వెలుగొండ కొండల్లో వెలసిన శ్రీ ఆదిలక్ష్మీ సమేత యోగ నరసింహస్వామి దేవస్థానంలో శుక్రవారం వరలక్ష్మీ వ్రతం వేడుకలు నిర్వహించనున్నట్లు నిర్వాహకులు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం ప్రత్యేక అభిషేకాలు, అలంకరణ, వరలక్ష్మీ వ్రతం, మధ్యాహ్నం అన్నదాన కార్యక్రమం నిర్వహించనున్నట్లు తెలియజేశారు.

నేడు ప్రత్యేక విజ్ఞప్తుల దినం

చిట్టమూరు:మండల పరిధిలోని అరవపాళెం గ్రామ సచివాలయంలో గురువారం ప్రత్యేక విజ్ఞప్తుల దినం నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ మనోహర్ గౌడ్ బుధవారం తెలిపారు. సచివాలయంలో ఉదయం 8 నుంచి 12 గంటల వరకు ప్రజలకు అందుబాటులో ఉండి అర్జీలు స్వీకరిస్తామని పేర్కొన్నారు. పంచాయతీలోని పెద్ద దరఖాస్తు, చిన్న దరఖాస్తు, చింతలతోపు, బయ్యవారికండ్రిగ, అరవపాళెం గ్రామస్తులు వినతిపత్రాలు అందజేయాలన్నారు.

మా ఇళ్లను కూల్చొద్దు



నిరసన తెలుపుతున్న గిరిజనులు

సైదాపురం: ''ప్రభుత్వం 1999లో ఇళ్ల స్థలాలు మంజూరు చేసి, పక్కా గృహాలను నిర్మించి ఇచ్చింది. అప్పటి నుంచి ఆ ఇళ్లలోనే జీవనం సాగిస్తున్నాం. కొందరు కక్ష కట్టి మా ఇళ్లను ఇళ్లను కూల్చివేస్తామంటూ భయభ్రాంతులకు గురి చేస్తున్నారు. మమ్మల్ని మీరు కాపాడాలి.'' అంటూ మండలంలోని చీకవోలు గిరిజన కాలనీ వాసులు బుధవారం తహసీల్దార్ సుభద్రకు విన్నవించుకున్నారు. ఆల్ ఇండియా ఎరుకుల సేవా సమితి జిల్లా అధ్యక్షులు ఇట్ల వెంకటేశ్వర్లు మాట్లాడుతూ పేదలకు న్యాయం చేయాలని కోరారు.

మృతదేహం అప్పగింత

పెళ్లకూరు: మండలంలోని నందిమాల గ్రామానికి చెందిన రైతు మునెయ్య(55)మృతదేహాన్ని స్థానిక పోలీసులు బుధవారం బంధువులకు అప్పగించారు. విద్యుత్ షాక్‌తో మృతి చెందిన మునెయ్య మృతదేహానికి నాయుడుపేట ప్రభుత్వాస్పత్రిలో పోస్టుమార్టం చేసి బంధువులకు అప్పగించారు.